విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న
మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు
బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో
ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను.
కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి
అవకాశం ఇవ్వబడును.

RNI NO,TELTEL/2023/88524
మెదక్ టుడే
తెలుగు దినపత్రిక MEDAK TODAY

Call us now!
9494117870



RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

ఆదివారం, ఆగష్టు 03 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 289


## కాంగ్రెస్ మాత్రమే మోదీని

## కుర్చీ నుంచి దింపగలదు: రేవంత్‌రెడ్డి

**ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తన కుర్చీ వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ 75 ఏళ్లు నిండిన వారిని పదవి నుంచి వైదొలగాలని చెప్పిన మోదీ ఎందుకు వినడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 2001 నుంచి మోదీ కుర్చీ ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు. అద్వానీ, మురళీ మనోహర్‌జోషికి వర్తించిన వయసు మోదీకి వర్తించదా? అని నిలదీశారు. మోదీనీ కుర్చీ నుంచి వచ్చే ఎన్నికల్లో దించేది రాహుల్ గాంధీ మాత్రమేనని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో మోదీని ఓడిస్తామని హెచ్చరించారు. మోదీని ఓడిస్తాం, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామని ఉద్ఘాటించారు. ఢిల్లీలో సీఎం రేవత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. (శనివారం) ఢిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీ కాంగ్రెస్ అని అభివర్ణించారు. బీజేపీతో సహా అన్ని పార్టీలు అధికారంలో లేకపోతే ఇంటికే పరిమితమని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్‌ది ప్రజాపక్షమేనని ఉద్ఘాటించారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేసి తూర్పు పాకిస్థాన్‌ని విడదీసింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. దేశం కోసం తన ప్రాణాన్ని కూడా ఇందిరాగాంధీ త్యాగం చేశారని కొనియాడారు. స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉందని తెలిపారు. బీజేపీ నేతలకు గుర్తు చేస్తున్న.. బ్రిటిష్ వాళ్లతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇందిరాగాంధీ పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించి పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసి కాళీకామాత అవతారం ఎత్తారని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని ఇందిరాగాంధీ రక్షించారని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీ ఉగ్రవాదుల పోరులో మరణించారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీ, బీజేపీని కాంగ్రెస్ ఓడిస్తుందని తెలిపారు. 2004లో కేంద్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిన సోనియాగాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత సోనియాగాంధీదని ప్రశంసించారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ అమలు చేసి చూపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి



వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. రాహుల్‌ను ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు కలిసి పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం కేంద్రప్రభుత్వం ప్రయత్నం చేయడం లేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 150 సీట్లకు మించి గెలవదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అంతా రాహుల్ గాంధీ వెంట ఉంటారని ఉద్ఘాటించారు. మోదీ నుంచి దేశాన్ని రక్షిస్తామని తెలిపారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు

## 2024 లోక్‌సభ ఎన్నికల్లో

### రిగ్గింగ్ జరిగింది ఆధారాలున్నాయి : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీఅన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన లీగల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం వ్యక్తిగతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు.ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదు అని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు.



లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పు డైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధాన సభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్దఉన్నట్లుచెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్‌లు

### తగ్గించేందుకు కాంగ్రెస్ కుట్ర కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం , తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. (శనివారం ఆగస్టు 2) ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు ,



బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తంపున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు కిషన్‌రెడ్డి.

### ఆయన దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనివ్వండి

## రాహుల్‌గాంధీపై రక్షణ మంత్రి సెటైర్

**న్యూఢిల్లీ:** అధికార బీజేపీ కి మేలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, అందుకు సంబంధించి తన దగ్గర ఆటమ్ బాంబు లాంటి సాక్ష్యం ఉందని శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్ ఇచ్చారు.రాహుల్‌గాంధీ దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనిద్దామని, కానీ ఆ పేలుడులో ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలని రక్షణ మంత్రి ఎద్దేవా చేశారు. 'రాహుల్‌గాంధీ తన దగ్గర ఆటమ్ బాంబు ఉందంటున్నాడు. ఉంటే ఒకసారి ఆయన దాన్ని పేల్చాలి. అయితే ఆ పేలుడు ఎలాంటి హాని



జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలి' అని వ్యాఖ్యానించారు.అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందంటున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే శనివారం పూట నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. రాహుల్ గాంధీ పార్లమెంట్లో భూకంపం సృష్టించబోతున్నాడని గతంలో కూడా ఆయన మనుషులు హంగామా చేశారని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. కానీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడినా ఎలాంటి భూకంపం రాలేదని, పైగా ఆ ప్రసంగం తడిచిన పటాసు లెక్క తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతికి ఎమర్జెన్సీ రక్తపు మరకలు ఉన్నాయని రాహుల్ గాంధీ గుర్తుపెట్టుకోవాలని, వైరిపక్షాలపై నోటికొచ్చిన ఆరోపణలు మానుకోవాలని రాజ్‌నాథ్ హితవుపలికారు.

## పాలిసెట్

### ఇంటర్నల్ స్లైడింగ్



**హైదరాబాద్, :** పాలిటెక్నిక్ కోర్సుల్లో ఇంటర్ స్లైడింగ్ శనివారం నుంచి జరగనున్నది. శని, ఆదివారాల్లో వెబ్ ఆప్షన్లు ఎంచు కోవచ్చు. ఈ నెల 5న సీట్లు కేటాయిస్తారు. సీటు వచ్చిన వారు 6వ తేదీలోపు రిపోర్ట్ చేయాలి. ఇంటర్నల్ స్లైడింగ్ విధానంలో సీటు వచ్చిన కాలేజీలో మరో బ్రాంచిలో సీటు ఉంటే వెబ్ ఆప్షన్లు ఇచ్చి, సీటును కైవసం చేసుకోవచ్చు.

## ఎన్‌కౌంటర్‌లో

## టెర్రరిస్టు హతం

**జమ్మూ కశ్మీర్ :** జమ్మూ కశ్మీర్ లోని కుల్గాం జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్ లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలను భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్ వివరాలు అందించింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. రాత్రి నుంచి ఉగ్రవాదులు, సైన్యం మధ్య తీవ్రమైన కాల్పులు జరుగుతున్నాయి. మరింత ధీటుగా బదులిస్తున్న సైన్యం ఉగ్రవాదుల పై ఉక్కుపాదం మోపింది. అని చినార్ కార్ప్స్‌లో తెలిపింది. ఇప్పటివరకు ఒక ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఆపరేషన్ అఖల్ కొనసాగుతోందని వివరించింది.దక్షిణ కాశ్మీర్‌జిల్లాలోని అఖల్‌లో భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే పక్కా సమాచారంతో భద్రతా దళాలు ఆపరేషన్ ప్రారంభించింది. దీన్ని గమనించిన ఉగ్రవాదులు సైన్యం పైకి కాల్పులు చేయడం ప్రారంభించాయి. ఉగ్రవాదులకు ధీటుగానే భారత్ సైన్యం బదులిచ్చింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, , స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్పాల్గొన్నాయి.ఉగ్రవాదిని



హతమార్చినప్పటికీ ఇంకా ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు దాక్కుని ఉండవచ్చని భారత సైన్యం చినార్ కార్ప్స్ తెలిపింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భద్రతా దళాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగానే అనుమానం ఉన్న ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అలానే అఖ్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. అనుమానాస్పద కదలికలు గుర్తించి అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఒక ఉగ్రవాదిని హతమార్చాయి. హతమైన ఉగ్రవాది గుర్తింపు ఇంకా నిర్ధారించలేదు. వీళ్లంతా లష్కరే తోయిబా ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నారు. వీరి కోసం గాలిస్తున్న సైన్యంపై కాల్పులు జరుపుతున్నారు

## ఈ మహిళలకు మాత్రమే

### పథకంతో నెలకు రూ. 7వేలు సంపాదన

**ఢిల్లీ:** ఎల్ఐసి బీమా సఖి యోజన అనేది మహి ళల కోసం ఒక ప్రత్యేక పథకం. ఇది గతేడాది డిసెంబర్‌లో ప్రారంభమైంది. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల మహిళల కోసం, ఇంకా వారు జీవిత బీమా ఏజెంట్లుగా మారడానికి శిక్షణను అందిస్తుంది. ఈ పథకం కింద, స్వయం సహాయక బృందాల నుండి శిక్షణ పొందిన మహిళలు.. తమ గ్రామాల్లో 'బీమా సఖీలు'గా పనిచేస్తారు, ఈ స్కీమ్ ద్వారా ప్రజలు బీమా ఇంకా సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందడంలో సహాయ పడతారు.గ్రామీణ భారతదేశంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, అందుకోసం వారికి తగిన మద్దతు



ఇవ్వడానికి ఇంకా, బీమాను ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇది ప్రధానంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలపై దృష్టి పెడుతుంది.

## మంత్రి కొండా సురేఖకు

### నాంపల్లి కోర్టు షాక్ క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ.. భారత రాష్ట్ర సమితి కార్యని ర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మంత్రి కొండా సురే ఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాం పల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 21 లోపు కేసు నమోదు చేసి.. నోటీసులు జారీ చేయాలని



న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.కేటీఆర్ ఆరోపణలు, కొండా సురేఖ వ్యాఖ్యలు.కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ వ్యవహారం, నటి సమంత విడాకుల వివాదం వంటి సున్నితమైన అంశాలలో కేటీఆర్‌పై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్నే లేపాయి. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని భావించిన కేటీఆర్, కొండా సురేఖపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు.నాంపల్లి కోర్టు ఆదేశాలు.కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాను సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకున్న నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు, కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. అంతేకాకుండా.. ఈ నెల 21వ తేదీలోపు నోటీసులు జారీ చేయాలని కూడా సూచించింది. ఈ కేసు విచారణ సందర్భంగా.. మంత్రి కొండా సురేఖ తరపు న్యాయవాదులు కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఫిర్యాదు ఊహాగానాల ఆధారంగా ఉందని, సరైన సమాచారం లేదని.. అలాగే ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్ పరిధి వంటి అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తారు. అయితే.. కోర్టు ఈ అభ్యంతరాలను తోసిపుచ్చింది.కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ పోగుల, కొండా సురేఖ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని బలంగా వాదించారు. ఈ వాదనలతో కోర్టు ఏకీభవించి.. కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తేల్చి చెప్పింది. ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. రాజకీయ నాయకులు పరువు నష్టం దావాలను ఎదుర్కోవడం కొత్తేమీ కానప్పటికీ.. క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించడం అరుదైన పరిణామంగా చెప్పుకోవచ్చు.మంత్రి స్పందన ఇదే..దీనిపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. కోర్టు ఆదేశాలపై తనకు ఇంకా ఎలాంటి సమాచారం అందలేదని.. నోటీసులు అందినతర్వాతస్పందిస్తాననికొండాసురేఖవెల్లడించారు

### కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు

## వైసీపీపై పవన్ కల్యాణ్ ఫైర్

**అమరావతి:** కూటమిలో ఉన్న మూడు పార్టీల్లోని నేతలు, కార్యకర్తలకు చిన్నచిన్న పొరపచ్చాలు ఉన్నా.. మీ స్థాయిలోనే పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మన కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి వైసీపీ నేతలుఎంతో ప్రయత్నం చేస్తారని.. మనం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అభివృద్ధిలో వెనుకబడ్డ ఏపీ తిరిగి ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు. కనీసం 15 సంవత్సరాలు ఈ కూటమి చాలా బలంగా ఉం




డాలని ఉద్ఘాటించారు. తమ ఈ ప్రయత్నం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని నొక్కిచెప్పారు.

### పోలవరం బనకచర్ల

## ఇల్లీగల్ ప్రాజెక్టు

**హైదరాబాద్:** పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. బనకచర్లపై ఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావని తెలిపారు. లోకేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలవరం బనకచర్లకు పర్యావ రణ అనుమతి లేదని,వ్యతిరేకించిందని గుర్తుచేశారు. (శనివారం)తెలంగాణ సచివాలయంలో మీడి యాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్ చేశారు.తానే స్వయంగా తన లెటర్ హెడ్‌పై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని స్పష్టం చేశారు. బనకచర్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. బనకచర్లపై తమ స్టాండ్ క్లియర్‌గా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని.. గులాబీ నేతలు పబ్లిసిటీ కోసం మాత్రమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. బీఆర్ఎస్ గాలి మాటలు తప్ప వాస్తవం లేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని.. ఎంతటి పోరాటానికి అయినా తాము సిద్ధమని ఉద్ఘాటించారు. కేంద్ర బీజేపీతో టీడీపీ పొత్తు ఉందని మంత్రి నారా లోకేష్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పోలవరం బనకచర్ల ఇల్లీగల్ ప్రాజెక్టుఅనిమంత్రిఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు.



# శ్రీ కోదండ రామాలయాన్ని దేవదాయ శాఖలో విలీనం చేయడం దుర్మార్గమైన చర్య





**- దేవాదాయశాఖ తక్షణమే విలినాన్ని విరమించుకోవాలి, వెంటనే జీవోను రద్దు చేయాలి**

**- మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి**

**మెదక్ ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా కొదండ రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్రెడ్డి మండిపడ్డారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కొదండ రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలినాన్ని నిరసిస్తూ శనివారం రామాలయం ముందు రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, భక్తులతో బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి. మాట్లాడుతూ...పట్టణ ప్రజలు,భక్తుల విరాళాలతో గత 49 సంవత్సరాల క్రితం నిర్మించుకున్న దేవాలయానికి ప్రభుత్వం నేటి వరకు ఎలాంటి సహాయ సహకారాలు అందించ లేదన్నారు. దినదినాభివృద్ధి చెందిన రామాలయంలో ప్రతి సంవత్సరం సీతా రాముల కల్యాణం, వేడుకలతో పాటు శ్రావణ మాస తదితర పూజలు భక్తుల సహకారంతో పాటు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉదయం 7 గంటలకు పోలీసుల బందోబస్తుతో దేవాదాయ శాఖ అధికారులు దొంగల్లా హుండీతో పాటు దర్శ సత్రాన్ని సీజు చేయడం సరికాదన్నారు. ఇట్టి ఆలోచనను దేవా దాయశాఖ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శిధిలావస్థలో గల దేవాలయాలను పట్టించుకోకుండా భక్తుల సహకారంతో అభివృద్ధి చెందిన దేవాలయాలను స్వాదినం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం కక్ష్య సాధింపు చర్యలతోనే శ్రీ కొదండ రామాలయాన్ని విలీనం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కుట్ర పూరితంగానే దేవాదాయశాఖకు అప్పగించిందని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. రాజకీయ కక్ష్య సాధింపులో భాగంగా భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి,పట్టణ కన్వీనర్ మామిళ్ల. ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, న్యాయవాది. జీవన్ రావు,మాజీ కౌన్సిలర్లు జయ రాజు,ఆర్కే శ్రీనివాస్, మాయ. మల్లేశం, విజయలక్ష్మి, హవెలిఘనపూర్ మం డల పార్టీ అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కిష్ట య్య, ఆంజనేయులు, శంకర్, తుమ్మ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మోహన్, గట్టేష్, నగేష్, ఇస్మాయిల్, నరేందర్ రెడ్డి, కిష్టారెడ్డి, బిఆర్ఎస్యువ నాయకులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధితకుటుంబానికి ఆర్థిక సాయం బియ్యం అందచేసిన మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్.



**చేగుంట ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్** చేగుంట పట్టణానికి చెందిన దాసరి రాములు తల్లి ఎల్లవ్వ మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి 50 కిలోల బియ్యం తో పాటు 2500 రూపాయలు ఆర్థిక సాయం చేసిన మాజీ సర్పంచ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మంచి కట్ల శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తో పాటు ఏరుకుల లక్ష్మణ్ కటికే రాజేష్ చంద్రన్ సింగ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పి ఎం కిసాన్ నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన బిజెపి నాయకులు



**శంకర పట్నం ఆగస్టు 2మెదక్ టుడే:** దేశానికి రక్షణగా ఉండే జవాన్ కు దేశానికి అన్నం పెట్టే కిసాన్ కి బిజెపి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అన్నారు. శనివారం 20 వ విడత పిఎంకిసాన్ నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలలో జమ చేసినందన వారణాసి నుండి భారత ప్రధాని నరేంద్ర మోడీ రైతులను ఉద్దేశించి ప్రసంగించగా కేశవపట్నంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పిఎం కిసాన్ నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రైతులకు బిజెపి నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేష్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, మందాడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, పడాల వెంకటలక్ష్మి, గూళ్ళ రాజు, బొజ్జ సాయి ప్రకాష్, రమణ రెడ్డిలతో పాటు ఏఇఓలు, వివిధ గ్రామాల రైతులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**హుజురాబాద్ ఆగస్టు 2మెదక్ టుడే:** ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎండి జనరల్ ఫిజీషియన్, డయోబెటాలజిస్ట్ డాక్టర్ మోడెపు శ్రీకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని శనివారం శ్రీరామ హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ శిబిరానికి హుజురాబాద్ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసామన్నార ఎఫ్బీఎస్, పిఎల్బీఎస్ ఉచిత పరీక్షలతో పాటు ప్రతి మంగళ వారం ఉచితంగా ఓపి చూస్తామని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షా కాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, తాగే నీటిని వేడి చేసుకుని తాగాలని అన్నారు. నేటి సమాజంలో చాలామంది డయాబెటిస్తో బాధపడుతున్నారని, షుగర్ వ్యాధి గ్రస్తులు తప్పకుండా షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవాలని అన్నారు. షుగర్ లెవెల్స్ అధికంగా పెరిగితే చాలా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రతి నెలకోసారి షుగర్ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు అని అన్నారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా సుమారు 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ఆస్పత్రి యాజమాన్యం నంబి భరణి కుమార్, ముష్కె శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది సతీష్, , సునీత, ఐశ్వర్య, అంజలి, శిరీష, సంధ్య, దీపిక తదితరులు ఉన్నారు

## మానవత్వం చాటుకున్న చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్



**చేగుంట ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రానికి చెందిన బాసం రాజు మరణించిన విషయం తెలుసుకున్న చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్ళి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు 1,00,000/- లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందచేసిన చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ తో పాటు రవి,నాగరాజు,కృష్ణ మూర్తి,వేణు,శ్రీను, జనార్ధన్ గౌడ్, సిద్దిరములు, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 5వ తేదీ ధర్నాను జయప్రదం చేయండి

**- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ**

**- ధర్నా కరపత్రం ఆవిష్కరణ**




**పాపన్నపేట, ఆగస్టు 2.మెదక్ టుడే న్యూస్:-**

ఉపాధ్యాయ, పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 న మెదక్ లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్పిసి నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు కుర్తివాడలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్, టి పి టీ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 5571 పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి.. పదోన్నతులు ద్వారా నింపాలన్నారు. సర్వీస్ రూల్ రూపోందించి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను, పీ ఆర్ సీ ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, వారిని సొంత జిల్లాలకు పంపాలని. జెడ్పి జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ, సరెండర్ లీవ్స్ మరియు పదవీ విర మణ పొందిన ఉపాధ్యాయలకు విరమణ రోజునే రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలి అని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్ర మంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల. భూష ణం, జిల్లా కార్యదర్శి నాచారం శేఖర్, జిల్లా నాయకులు కె.వి.ఆ ర్ నాయుడు, మల్లేశం మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెడ్డి సింగ్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్



**చేగుంట ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్** చేగుంట పట్టణానికి చెందిన రెడ్డి సింగ్ భార్య మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు 2500 ఆర్థిక సాయం చేసిన చేగుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తో పాటు కటిక రాజేష్,సోమ వెంకటేష్,చంద్ర సింగ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగినది.

# ఇమాంపూర్ లో నూతన సీసీ కెమెరాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు






**తూప్రాన్ ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్**

తూప్రాన్ మండలం ఇమాంపూర్ లో ఏర్పాటు చేసిన సీసీ కమాండ్ కంట్రోల్ కెమరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావ్ మరియు అడిషనల్ ఎస్పీ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్కొక్క సీసీ కెమరా వంద మంది పోలీసులతో సమానం అని సీసీ కెమెరాల ప్రాధాన్యత గూర్చి వివరించారు. ఇమాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల అమరికలు చాలా అద్భుతంగా ఉన్నాయని ఇంత చక్కగా సీసీలను తీర్చిదిద్దిన తూప్రాన్ డీఎస్పీ,సీఐ,ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్ లను జిల్లా ఎస్పీ ప్రశంసించారు. మండలంలోని ముఖ్య నాయకులు గ్రామ ప్రజలు కలసికట్టుగా వారి సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీని ఆహ్వానించి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. వారు ఈ సమావేశం మాట్లాడుతూ ఈమధ్య కాలంలో చాలా మట్టుకు క్రైమ్ పెరిగిపోవడం జరిగింది. దీనికీ అనుకూలంగా సీసీ లు ఉపయోగపడతాయని అర్ధరాత్రుల్లో అపరిచిత వ్యక్తులు ఏ ప్రాంతములో తిరిగిన సీసీలో రికార్డు అవుతాయని దీని బట్టి చొరికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం సులువుగా ఉంటుదని ఎస్పీ తెలిపారు. ఇందులో అడిషనల్ ఎస్పీ మహేందర్ డీఎస్పీ నరేందర్ గౌడ్,సిఐ రంగా కృష్ణ,ఎస్ఐ శివానందం నాయకులు సత్యనారాయణ గౌడ్, రమేష్, నవీన్ గౌడ్, యదగిరి,మన్నె యాదగిరి, స్వామి,సత్యనారాయణ,పాండు ఎ. రాములు,స్వామి గౌడ్,జనార్దన్,శివ గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# పీఎం కిసాన్ నిధులు విడుదల





**పాపన్నపేట,ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్** పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుండి 9.7 కోట్ల మంది రైతులకు 20 వ విడత నిధులు రూ. 20.500 కోట్లు విడుదలయ్యాయని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి తెలిపారు. శనివారం పొడ్చన్ పల్లి రైతు వేదికలో జరిగిన పీఎం లైవ్ కార్యక్రమాన్ని రైతులతో కలిసి ఆమె వీక్షించి మాట్లాడారు. దీని ద్వారా రైతులకు ఏటా ఒక్కో విడత రూ. 2 వేల చొప్పున 3 విడతల్లో రూ. 6 వేల సాయం అందుతుందన్నారు. మండల లోని పలు రైతు వేదికలలో ఈకార్యక్రమం జరుగగా వ్యవసాయ విస్తరణ అధికారులు నాగరాజు,అసిఫ్, అభిలాష్,జనార్దన్, రజిత, రైతులు పాల్గొన్నారు .

# పట్టు సాధించేలా ఉండాలి



**పాపన్నపేట, ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్ :-** కుర్తివాడ ఉన్నత పాఠశాలలో ఉన్నత స్థాయి మాథ్స్ కాంప్లెక్స్ మీటింగ్ శనివారం జరిగింది. టేక్మాల్,పాపన్నపేట గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాలొ న్నారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యా యులు సమయపాలన పాటించాలన్నారు.విద్యార్థులు గణితశాస్త్రం పై పట్టు సాధించేలా బోధన చేయాలని వారికీ ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భవాని ప్రసాద్,వెంకటేశం,శివకుమార్, కిషన్,విక్రమ్ గౌడ్,రిసోర్స్ పర్సన్ బాలరాజు,పవన్ ఉన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**- మెదక్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు. మాజీ ఎమ్మెల్యేపద్మ దేవేందర్ రెడ్డి**



**మెదక్ ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** ఔరంగాబాద్ గ్రామ నివాసి నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డే దుర్గమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం స్థానిక బి ఆర్ ఎస్,నాయకుల ద్వారా తెలుసుకున్న పద్మ దేవేందర్ రెడ్డి, కుటుంబానికి, 5000/ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భీమరి కిషోర్, వంజరి జయరాజ్, మోహన్, కిరణ్ ఇస్మాయిల్, బి ఆర్ ఎస్, నాయకులు పాల్గొన్నారు.

# బోనకల్లు విద్యుత్ సేవా కేంద్రం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

**బోనకల్లు, ఆగస్టు 02 :** బోనకల్లు మండల కేంద్రంలోని విద్యుత్ సేవా కేంద్రం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వైరా ఏడిఈ పోతగాని కిరణకుమార్ వైఖరికి నిరసనగా గోవిందాపురం గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాదినేని వీరభద్రరావు, వేడునూతల లక్ష్మణరావు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం రైస్ మిల్లు, స్థానికుల కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయగా ఆ దిమ్మె శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యుత్ అధికారులు పది రోజుల క్రితం పునర్మించినట్లు తెలిపారు. అయితే కొత్తగా నిర్మించిన దిమ్మెను తొలగించి రోడ్డు పక్కన మరో స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మె నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు ఉమ్మనేని బాబు సూచించడం దారుణమన్నారు.ఆయన సూచనకు విద్యుత్ అధికారులు సరేననడం దారుణమన్నారు. ఆయన చెప్పిన విధంగా దిమ్మె ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావునా విద్యుత్ శాఖ వారు నిర్మించిన దిమ్మెపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సునీత, నల్లమోతు వాణి, కొమ్ము కమలమ్మ, గడ్డం విజయ, చింతలచెరువు మంగమ్మ, గోళ్ల అచ్చమ్మ, నల్లమోతు వెంకట నరసమ్మ, ద్రోనోజుల వెంకటలక్ష్మి, తమ్మారపు లక్ష్మణరావు, కారంగుల చంద్రయ్య, పసుపులేటి నరేశ్, శ్రీనివాసరావు, కళ్యాణపు బుచ్చయ్య, కోట కాటయ్య, పుచ్చకాయల వలరాజు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలి

**- మెదక్ లో వార్డుల్లో పర్యటించిన జిల్లా అడిషనల్? కలెక్టర్? నగేష్**




**మెదక్ ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
మెదక్? పట్టణంలో మున్సిపల్? అధికారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఈ విషయంలో ప్రజలు సైతం అధికారులు, సిబ్బందికి సహకరించాలని జిల్లా అడిషనల్? కలెక్టర్? నగేష్? అన్నారు. వంద రోజుల యాక్షన్? ప్లాన్?లో భాగంగా శనివారం అడిషనల్? కలెక్టర్? పట్టణంలోని 23, 31వ వార్డుల్లో మున్సిపల్? కమిషనర్? శ్రీనివాస్? రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాల్సిందిగా తెలిపారు. అలాగే ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్? వ్యాధులు వ్యాపించకుండా దోమలు వ్యాప్తి చెందకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్? కమిషనర్? శ్రీనివాస్? రెడ్డి, సిబ్బందిని అడిషనల్? కలెక్టర్? నగేష్? ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న నీటి సమస్యపై అడిషనల్? కలెక్టర్? నగేష్? దృష్టికి తీసుకురాగా వెంటనే నీటి సమస్యను తీర్చాలని... బోరు మోటార్ల ద్వారా పాత నల్లాలు వచ్చేలా చూడాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్? మున్సిపల్? ఇంఛార్జి శానిటరీ ఇన్స్?పెక్టర్? నాగరాజు, ఎన్విరాన్?మెంటల్? ఇంజనీర్? వెంకటేశ్?, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వాటర్? వర్క్?, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు తొలి టీకా

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ**



**మెదక్ జిల్లా, చిన్న శంకరం పేట. ఆగస్టు 02 (మెదక్ టుడే):-** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని రుద్రారం అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “తల్లిపాలు తాగడం బిడ్డ ఆరోగ్యానికి తలపు తాళం, ముర్రుపాలు అంటే మొదటగా వచ్చే పాలు, వీటిలో కోలాస్ట్రం అనే శక్తివంతమైన రోగ నిరోధక పదార్థం ఉంటుందని ఇవి బిడ్డకు జీవితాంతం ఆరోగ్య రక్షణ కలిగిస్తాయని” తెలిపారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను తాగించాలని,ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని,ఆపై రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని,ఏడవ నెల నుండి అనుబంధాహారం ప్రారంభించాలని,పాలిచ్చే తల్లి పరిశుభ్రతపాటించాలని,పోషకాహారం తీసుకోవాలని సూచించారు.ఇది తల్లికి రొమ్ము క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తుందని,బిడ్డకు సంబంధించి అన్నిటీకాలువేయించాలని, బరువు, ఎత్తు కొలవాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తల్లిపాలలో ఉన్న పోషక విలువల గురించి మాతృమూర్తులకు స్పష్టమైన సమాచారం అందించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మంచాల లక్ష్మణ్, ఉపసర్పంచ్ ప్రసాద్, వార్డ్ సభ్యులు చాకలి నరేష్, కర్రీ రాజు, అంగన్వాడి టీచర్ శాలిమ, రూప, రాణి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్ కవిత, అంగన్వాడి ఆయా గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**చేగుంట ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ శంభుని శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిం చడం జరిగింది.ఈ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా రీజియన్ చైర్ పర్సన్ ఆర్ సి లయన్ సంజయ్ గుప్తా విచ్చే యడం జరిగింది .అలాగే రీజియన్ కోఆర్డినేటర్ లయన్ నేతి శ్రీనివాస్ . జోన్ చైర్ పర్సన్లు లయన్ ఆకుల సుఖేందర్, లయన్ మల్లేశ్ గౌడ్, మరియు డి. సి /పాస్ట్ ఆర్ సి లయన్ జి. రాధ కృష్ణ గారు పాల్గొన్నారు.. ఆర్ సి సంజయ్ గుప్తా మాట్లాడు తూ చేగుంట క్లబ్ అధ్యక్షుడు లయన్ శంభుని శ్రీనివాస్ జన్మదిన వేడుకలకు హాజరైనందుకు ఎంతో సంతోషంగా ఉందని, శ్రీనివాస్ మంచితనం సేవా దృక్పథం చలాకీ తనం నాకెంతో నచ్చుతుందని మున్ముందు లైన్స్ క్లబ్ లో ఇంకెన్నో బాధ్యతలు తీసుకోవాలని కోరారు.అలాగే ఇలాంటి వేడుకలు నిర్వహించడం వల్ల ప్రతి సభ్యునిలో స్నేహం పెరిగి మంచి ఆలోచనతో కూడుకున్న చక్కని వాతావరణం పెంపొందుతుంది అన్నారు. ఈ వేడుకల్లో క్లబ్ సెక్రెటరీ పుల బోయిన నాగరాజు, క్లబ్ డి ఎస్ ద్యావ లింగమూర్తి, క్లబ్ డిసి సిహెచ్ నర్సింలు,మరియు ఫాస్ట్ ప్రెసిడెంట్లు వీరబ్రహ్మం, మంచికట్ల శ్రీనివాస్, స్వర్గం సిద్ధిరాములు, పాల రాంరెడ్డి, గార్దాస్ మనోహర్ రావు, తుమ్మ శ్రీనివాస్, సభ్యులు రాంచంద్రం, సతీష, సంజీవ్, రమేష్, రాజు, నర్సింహారెడ్డి సురేష్ పాల్గొన్నారు.



# వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**బోనకల్లు, ఆగస్టు 02 :** వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం బోనకల్లు మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు కారంగుల చంద్రయ్య, దూబ భద్రాచలం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహాసభలో వారు మాట్లాడుతూ.. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కూలీలకు రోజువారి కూలీ రూ.400 అమలు చేసే విధంగా చట్టాన్ని తీసుకురావాలన్నారు.ఉపాధి హామీ పథకానికి కేంద్రం ప్రతి ఏడాది నిధులు తగ్గిస్తూ మొత్తంగా పథకాన్ని లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పొట్ట కొట్టి పెట్టుబడిదారుల జేబులు నింపడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతుందన్నారు. హక్కుల సాధన కోసం వ్యవసాయ కూలీలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలచెరువు కోటేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ నాయకులు కిలారి సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, దోబ భద్రాచలం, రాష్ట్ర నాయకురాలు బంధం వెంకటరాజ్యం పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తెల్లాకుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బంధం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కర్లకుంట మత్తయ్య, సహాయ కార్యదర్శిగా పిక్కెల సీతారాములుతో పాటు మరో 16 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# నైట్ పార్టీలకు వెళ్తే గ్యాంగ్‌రేప్ జరగొచ్చు
## ట్రాఫిక్ పోలీసుల పోస్టర్లపై విమర్శలు




**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ట్రాఫిక్ పోలీసులు భద్రతలో భాగంగా సిటీలో పెట్టిన పోస్టర్లు వివాదానికి దారి తీశాయి. ఇంట్లోనే ఉంటే, అత్యాచారాలు జరగవని వెలసిన పోస్టర్లపై విమర్శలు వస్తున్నాయి. సిటీలోని కొన్ని ప్రాంతాల్లో ఆ పోస్టర్లను పెట్టారు. దీంతో గుజరాత్ మహిళ భద్రతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అర్థరాత్రి పార్టీలకు హాజరుకావొద్దు అని, ఒకవేళ పార్టీలకు వెళ్తే అత్యాచారం లేక గ్యాంగ్ రేప్ జరిగే అవకాశాలు ఉన్నట్లు పోస్టర్లలో రాశారు. చీకటి, నిర్జన ప్రదేశానికి స్నేహితుడితో వెళ్లవద్దు అని, ఎందుకంటే రేప్ కానీ, గ్యాంగ్ రేప్ కానీ జరిగే అవకాశం ఉన్నట్లు పోస్టర్లలో హెచ్చరించారు. నగరంలోని సోలా, చంద్‌లోదియా ప్రాంతాల్లోని రోడ్ డివైడర్లపై పెట్టారు.ఆ పోస్టర్లపై విమర్శలు రావడంతో వాటిని తొలగించారు. రోడ్డు భద్రత కోసం సిటీ ట్రాఫిక్ పోలీసులు ఆ పోస్టర్లను పెట్టినట్లు డీసీపీ నీతా దేశాయ్ తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల అనుమతితో సతర్కతా అనే ఎన్జీవో ఆ వివాదాస్పద పోస్టర్లను తయారు చేసింది. స్కూల్, కాలేజీ పిల్లల్లో ట్రాఫిక్ అవగాహన కల్పించేందుకు ఓ ఎన్జీవో తమను ఆశ్రయించిందని, కానీ వివాదాస్పద పోస్టర్లను తమకు చూపించలేదని ఆ డీసీపీ తెలిపారు. అయితే పోస్టర్లకు చెందిన అంశాన్ని తమ దృష్టికి తీసుకురాగానే వాటిని తొలగించినట్లు ఆమె చెప్పారు.

# మోదీ పేరు చెప్పమని నన్ను బలవంత పెట్టారు
## ప్రజ్ఞా ఠాగూర్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** మాలేగావ్ పేలుళ్ల కేసులో నిర్దోషిగా బయటపడిన బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పమని ఇన్వెస్టిగేటర్లు తనను బలవంతం చేశారని వెల్లడించారు. మాలేగావ్ పేలుళ్ల కేసులో ముంబై ప్రత్యేక కోర్టు గురువారంనాడిచ్చిన తీర్పులో ప్రజ్ఞా ఠాగూర్, లెఫ్టినెంట్ కల్నర్ ప్రశాంత్ శ్రీకాంత్ పురోహిత్, మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది.ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాల్సిందిగా సీనియర్ అధికారులు తనకు ఆదేశాలిచ్చారనియాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ మాజీ అధికారి మహబూబా ముజావర్ ఇప్పటికే సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారుల ఆదేశాలు పాటించేందుకు నిరాకరించడంతో తనపై కేసులు బనాయించారని, అయితే వాటి నుంచి తాను బయటపడ్డానని చెప్పారు. కేసును తప్పుదారి పట్టించేందుకు, సఫ్రాన్ టెర్రర్ కేసుగా ఈ ఘటనను చిత్రీకరించేందుకు ప్రయత్నం



జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజ్ఞా ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.టార్చర్ పెట్టారు.ప్రజ్ఞా ఠాగూర్ శనివారంనాడు మీడియాతో మాట్లాడుతూ 'బీజేపీ సీనియర్ నేత రామ్ మాధవ్‌తో సహా పలువురు పేర్లు చెప్పమని వాళ్లు (ఇన్వెస్టిగేటర్లు) నన్ను టార్చర్ పెట్టారు. నా ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. అక్రమంగా నన్ను ఆసుపత్రిలో నిర్బంధించారు. ఈ విషయాలన్నీ నేను రాసే స్టోరీలో ఉంటాయి. కానీ నిజాన్ని ఎన్నటికీ దాయలేదు. నేను గుజరాత్‌లో నివసిస్తున్నాను. అందుచేత వాళ్లు నన్ను నరేంద్ర మోదీ పేరు చెప్పమన్నారు. వాళ్ల నాతో అబద్ధం చెప్పించాలనుకుంటున్నందున నేను ఎవరి పేర్లు చెప్పలేదు' అని చెప్పారు. యోగి ఆదిత్యనాథ్, భాగవత్, ఇంద్రేష్ కుమార్ పేర్లు కూడా చెప్పమని విచారణాధికారులు తనను బలవంతం చేశారని ప్రజ్ఞా ఠాగూర్ చెప్పారు. తాము చెప్పమన్న పేర్లు చెబితే నిన్ను కొట్టమని కూడా వాళ్లు తనకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారని తెలిపారు.

# బూత్ లెవల్ అధికారుల పారితోషికాన్ని డబుల్ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

**బీహార్** :అసెంబ్లీ ఎన్నికల కు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల్లో ని సవరించింది. 2015 తర్వాత ఈసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలను సవరించడం ఇదే తొలిసారి. తాజా సవరణ ప్రకారం బూత్ లెవల్ అధికారుల పారితోషికాన్ని ఈసీ ఏకంగా రెండింతలు చేసింది. 2015 నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులకు పారితోషికంగా రూ.6 వేలు ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.12 వేలు చేసింది.అదేవిధంగా ఓటర్ల జాబితాను సరిచూసినందుకు బీఎల్‌వోలకు గతంలో రూ.1000 ఇన్సెంటివ్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఇన్సెంటివ్‌ను రూ.2 వేలకు పెంచారు. ఇక బీఎల్‌వో సూపర్‌వైజర్లకు గతంలో రూ.12 వేలు పారితోషికంగా ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.18 వేలు చేశారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కు గతంలో ఎలాంటి గౌరవభృతి ఇచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు ఈఆర్‌వోలకు రూ.25 వేలు, ఏఈఆర్‌వోలకు రూ.30 వేలు గౌరవభృతి ఇవ్వనున్నారు.అదేవిధంగా బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో జరిగిన ఓటర్ల జాబితా అత్యవసర సవరణ కోసం పనిచేసిన బూత్ లెవల్ అధికారులకు కూడా ఎన్నికల సంఘం రూ.6 వేలు ప్రత్యేక ఇన్సెంటివ్‌గా ప్రకటించింది.




# నేను రాజును కాను కావాలనుకోవడం లేదు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివా రం యాన్యువల్ లీగల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాహుల్ ప్రసం గం సభలో ఆయన మద్దతుదారులు నినదించారు. 'ఇస్ దేశ్ కా రాజా కైసా హెూ.. రాహుల్ గాంధీ జైసా హెూ' అని పలువురు నినదించగా దానికి రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాను రాజును కాదని.. కావాలని అనుకోవడం లేదన్నారు. అయినా పలువురు అలాగే నినాదాలు చేశారు. తాను రాజుగా మారాలని కూడా కోరుకోవడం లేదని.. తాను రాజును వ్యతిరేకిస్తున్నానని.. నేను ఆ భావనకు కూడా వ్యతిరేకినన్నారు. రాహుల్ గాంధీ గతంలో ప్రధానిని ఉద్దేశించి 'రాజు'గా అభివర్ణిస్తూ ప్రజల గొంతుక వినడం లేదంటూ ఆరోపించారు. 'రాజ్యాంగ సవాళ్లు : దృక్కోణాలు, మార్గాలు' అనే థీమ్ వని వారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో లీగల్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని మండిపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని.. దాదాపు 70 నుంచి వంద స్థానాల్లో రిగ్గింగ్ జరిగి ఉండవచ్చన్నారు. ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోదీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదన్నారు. స్వల్ప మెజారిటీతో మోదీ ప్రధాని పీఠాన్ని అలంకరించారన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకా తక్కువగా సీట్లు వచ్చి ఉంటే ఆయన ప్రధాని పీఠం వరకు వెళ్లేవారు కాదన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షలలో ఓటర్లు



నకిలీయేనని తేలిందని రాహుల్ తెలిపారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారన్నారు.అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందం టున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే శనివారం పూట నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. ఆటం బాంబులా కుదిపేస్తుందన్న ఆయన.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు.గతంలో తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై మాట్లాడలేకపోయేవాడి నన్నారు. తమ చేతలో ప్రస్తుతం వందశాతం సాక్ష్యాలు ఉన్నాయని.. అదే ధీమాతో ప్రస్తుతం మాట్లాడుతున్నానన్నారు. తాను లోక్‌సభ ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించిన ఆధారాలను చూపిస్తే, కొందరు సంభ్రమాశ్చర్యాలకు గురవుతు న్నారని.. అదెలా సాధ్యమైందని ప్రశ్నిస్తున్నా రన్నారు.ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొ న్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదు అని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. కానీ, అది సాధ్యమేనని.. నిజంగానే జరుగుతోందన్నారు. 2014 నుంచే తనకు అనుమానంగా ఉందన్నారు. అప్పటి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల విషయంలోనూ సందేహాలు ఉన్నాయన్నారు. పూర్తిగా మెజారిటీతో కొందరికి వచ్చినా ఏకపక్ష విజయాలు తనలో అనుమానాలు పెంచాయన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనైతే కాంగ్రెస్‌కు ఒక్క లోక్‌సభ సీటు రాలేదని.. ఆయా ఆ ఫలితాలు తనను ఆశ్చర్యపరిచాయన్నారు.

# పారిశ్రామికవేత్తలపై దాదాగిరి అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది: సీఎం ఫడ్నవీస్

**ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పారిశ్రామికవేత్తలపై దాదాగిరి పెరుగుతున్నదని అన్నారు. దీంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నదని ఆరోపించారు. పూణే మెట్రోపాలిటన్ రీజియన్ గ్రోత్ హబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. పుణే అభివృద్ధికి 'దాదాగిరి' అతిపెద్ద అడ్డంకి అని అన్నారు. పరిశ్రమలపై ఒత్తిడి తీసుకురావడానికి లేదా కాంట్రాక్టులు ఇవ్వడానికి కొన్ని శక్తులు దాదాగిరి, బెదిరింపు వంటి చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. 'నేడు, కొంతమంది తాము సిఫార్సు చేసిన అభ్యర్థులను నియమించుకోవాలని, తమ నుంచి ముడి పదార్థాలను కొనుగోలు చేయాలని, తమ వారికి మాత్రమే కాంట్రాక్టులను కేటాయించాలని పరిశ్రమలపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ రకమైన జోక్యం పూణే పురోగతికి ప్రధాన అడ్డంకిగా మారింది' అని అన్నారు.కాగా, ఈ బెదిరింపు మనస్తత్వాన్ని నిర్మూలించకపోతే, మహారాష్ట్రలో రెండవ అతిపెద్ద నగరం, దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలలో ఒకటైన పూణే దాని నిజమైన అభివృద్ధి సామర్థ్యాన్ని సాధించలేదని ఫడ్నవీస్ తెలిపారు. పెట్టుబడిదారుల స్వేచ్ఛ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ప్రభుత్వ స్థాయిలో ఇబ్బంది లేని వాతావరణాన్ని నిర్ధారించడం సరిపోదని అన్నారు. విస్తృత సామాజిక, రాజకీయ, పర్యావరణ వ్యవస్థలన్నీ వ్యాపారాలకు అనుకూలంగా ఉండాలని స్పష్టం చేశారు. అయితే స్థానికంగా రాజకీయ బలం ఉన్న ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం లేదా ఎంఎన్ఎస్ దాడుల గురించి ఫడ్నవీస్ ఈ వ్యాఖ్యలు చేశారా అన్నది అర్థం కాలేదు.



# తక్కువ శిక్ష వేయండి న్యాయమూర్తిని వేడుకుంటూ ఏడ్చేసిన ప్రజ్వల్ రేవణ్ణ


**బెంగళూరు :** అత్యాచారం కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ మనవడు.. హసన్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ను బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో శిక్షకు సంబంధించిన తుది తీర్పును కోర్టు నేడు వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని వేడుకుంటూ ఆయన ముందు బిగ్గరగా ఏడ్చినట్లు తెలిసింది.హసన్ జిల్లాలోని హూలేనరసరపురలోని గన్నికాడ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న 48 ఏండ్ల పనిమనిషిపై రేవణ్ణ కొవిడ్ సమయంలో 2021లో రెండుసార్లు లైంగిక దాడి చేశారు. అంతేకాక ఆ దారుణాన్ని మొబైల్ ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. రేవణ్ణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో హసన్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆయన తరఫున ప్రధాని నరేంద్రమోదీ కూడా ప్రచారం నిర్వహించారు.అదే సమయంలో మహిళలపై ప్రజ్వల్ సాగించిన లైంగిక దాడులకు సంబంధించిన వీడియోలు బయటకు రావడం, విస్తృతంగా ప్రచారం కావడం కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో



రేవణ్ణపై లైంగిక దాడి, లైంగిక వేధింపులు తదితర నాలుగు వేర్వేరు కేసులను సిట్ నమోదు చేసింది. అప్పటికే ఆయన జర్మనీకి పారిపోయారు. జర్మనీ నుంచి వచ్చిన ఆయనను గత ఏడాది మే 31న అరెస్ట్ చేశారు. దీంతో గత 14 నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారు.విచారణలో ఫోరెన్సిక్ నివేదికలు కూడా ఆ వీడియోలో ఉన్నది ప్రజ్వలే అని నిర్ధారించాయి. హసన్ ఎంపీ సీట్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమైన రేవణ్ణను తర్వాత పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పనిమనిషిపై అత్యాచార ఘటనే కాదు, ఆయనపై అశ్లీల వీడియోల కేసులు నమోదు అయ్యాయి. హసన్‌లోని అతని ఫామ్‌హౌస్ నుంచి 2,900 వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి. సాక్షాత్తు ప్రజ్వలే పలు వీడియోలను చిత్రీకరించినట్టు ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టే ప్రత్యేక కోర్టు రేవణ్ణ కేసులో నిన్న తీర్పు చెప్పింది. ఆయా కేసుల్లో ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. రేవణ్ణకు మొత్తం నాలుగు కేసుల్లో శనివారం శిక్ష ఖరారు చేయనున్నట్టు ప్రత్యేక న్యాయస్థానం జడ్జి సంతోష్ గజానన్ భట్ తెలిపారు.

# న్వర్ యాత్రలో ఘర్షణ సీఆర్పీఎఫ్ జవాన్‌పై కాల్పులు జరిపి హత్య

**చండీగఢ్:** కన్వర్ యాత్రకు వెళ్లిన సొంత గ్రామానికి చెందిన వ్యక్తులు, సీఆర్పీఎఫ్ జవాన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సెలవుపై గ్రామానికి వచ్చిన ఆయనపై కాల్పులు జరిపి హత్య చేశారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని సోనిపట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖేరి దమ్కన్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కృష్ణన్ కుమార్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో అతడు విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల కిందట సొంత గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కన్వర్ యాత్ర కోసం హరిద్వార్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ జవాన్ కృష్ణన్, వారి మధ్య ఘర్షణ జరిగింది.కాగా, ఈ గొడవ తర్వాత కృష్ణన్ సెలవుపై తన గ్రామానికి వచ్చాడు. జూలై 28న తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్న అతడిపై కారులో వచ్చిన కొందరు వ్యక్తులు కాల్పులు జరిపి హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు.మరోవైపు సీఆర్పీఎఫ్ జవాన్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. కన్వర్ యాత్ర కోసం హరిద్వార్ వెళ్లి కృష్ణన్‌తో గొడవ పడిన గ్రామానికి చెందిన వ్యక్తులు అతడ్ని చంపినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. కారు డ్రైవర్ సాగర్, ప్రవీణ్ అలియాస్ మెంధక్, మోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



# సోదరులతో కలిసి భర్త హత్యకు భార్య యత్నం
## అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడిన వ్యక్తి

**లక్నో:** ఒక మహిళ తన భర్తను చంపేందుకు సోదరులతో కలిసి కుట్రపన్నింది. దీంతో కొందరు గూండాలతో కలిసి అతడ్ని కొట్టారు. కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. ఒక చోట గొయ్యి తవ్వి సజీవంగా పాతిపెట్టేందుకు ప్రయత్నించారు.అయితే ఒక వ్యక్తి అక్కడకు రావడంతో వారంతా పారిపోయారు. ఈ నేపథ్యంలో అదృష్టవశాత్తు అతడు బతికిపోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఈ సంఘటన జరిగింది. రాజీవ్ అనే వ్యక్తికి 2009లో సాధనతో పెళ్లి జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. గ్రామంలో సొంత ఇల్లు ఉన్నది. అయితే భార్య బలవంతంపై బరేలీలోని అద్దె ఇంట్లో రాజీవ్ నివసిస్తున్నాడు. ఒక డాక్టర్ వద్ద అసిస్టెంట్‌గా అతడు పనిచేస్తున్నాడు.కాగా, భర్త రాజీవ్ హత్య కోసం భార్య సాధన కుట్రపన్నింది. భర్తను చంపాలని తన ఐదుగురు సోదరులకు చెప్పింది. ఈ నేపథ్యంలో కొంతమంది కిరాయి గూండాలతో కలిసి రాజీవ్‌ను హత్య చేసేందుకు వారు



ప్రయత్నించారు. జూలై 21న రాత్రి వేళ ఇంటి వద్ద ఉన్న అతడిపై 11 మంది వ్యక్తులు దాడి చేశారు. రాజీవ్‌ను కర్రలతో కొట్టారు. అతడి కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. తీవ్రంగా గాయపడిన రాజీవ్‌ను సమీపంలోని అటవీ ప్రాంతానికి వాహనంలో తీసుకెళ్లారు. సజీవంగా పాతిపెట్టేందుకు అక్కడ గొయ్యి తవ్వారు. ఇంతలో ఒక వ్యక్తి అటు రావడం చూసి వారంతా అక్కడి నుంచి పారిపోయారు.మరోవైపు తీవ్ర గాయాలతో కదలలేక, కనీసం నోరు విప్పలేని స్థితిలో ఉన్న రాజీవ్‌ను ఆ వ్యక్తి చూశాడు. అంబులెన్స్ కోసం ఫోన్ చేశాడు. దీంతో అతడ్ని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, కోడలు, ఆమె సోదరులు తన కుమారుడ్ని కొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు రాజీవ్ తండ్రి తెలుసుకున్నాడు. దీంతో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. తన కుమారుడి హత్యకు యత్నించిన అత్తింటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095- 9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..